క్లుప్తంగా

నాడు - నేడుపై సమీక్ష



నాడు - నేడుపై సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీడీఓ

సంతకవిటి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో నాడు–నేడు పనులపై ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి గురువారం సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ నాడు–నేడు పథకం కింద నిధులు మంజూరైన పాఠశాలల్లో వేసవి సెలవులు ముగిసేలోగా అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నాడు–నేడు ఫేజ్–2 కింద నిధులు మంజూరైన పాఠశాలల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. సమీక్షలో ఎంఈఓ బి.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



సచివాలయంలో సమీక్షిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

వంగర: గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు అన్నారు. అరసాడ సచివాలయంలో సిబ్బందితో ఆయన గురువారం సమీక్షించారు. గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, గృహ నిర్మాణాలు, నాడు–నేడు పనుల నిర్వహణ, ఎస్‌డీజీ సర్వే, ఆధార్ అప్‌డేషన్, పారిశుద్ధ్య చర్యలు వంటి అంశాలపై సమీక్షించారు. ప్రజా సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్ల పంపిణీ



రైతులకు కిట్ల పంపిణీ అందజేత

రేగిడి : మండలంలోని చాటాయివలస రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు గురువారం నవధాన్యాల విత్తనాల కిట్లు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీహెచ్ శారద, సర్పంచ్ కరణం గోవిందరావు తదితరులు వీటిని రైతులకు అందించి అవగాహన కల్పించారు. ఖరీఫ్ ముందు తొలకరి వర్షాలు సమయంలో పొలాల్లో ఈ నవధాన్యాలు వేసి, ఖరీఫ్ దుక్కుల్లో దున్నేయాలని, సేంద్రియ ఎరువుగా ఉపయోగపడి, భూమికి సత్తువను ఇస్తాయని సూచించారు. 80 మంది రైతులకు వీటిని అందజేశారు. ఒక్కొక్కరికి 8 కిలోల చొప్పున వీటిని అందించారు. కార్యక్రమంలో వీఏఏ కెంబూరు శ్రీనివాసరావు, వీఆర్‌ఓ సన్నిందొర, ఐసీఆర్ పీలు తవిటినాయుడు, కె.రమణ పాల్గొన్నారు.


కోరిన వెంటనే ఉపాధి పనులు



సమీక్షిస్తున్న ఏపీడీ శ్రీనివాసరావు

రాజాం : ఉపాధి వేతనదారులు కోరిన వెంటనే పనులు కల్పించాలని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు టీఏలకు, ఎఫ్‌ఏలకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీలు వారీగా ఉపాధి పనులు వివరాలు, వేతనాల చెల్లింపుపై ఆరా తీశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని సూచించారు. జాబ్‌కార్డులు ఉన్నవారు కోరిన వెంటనే పనిని ఇవ్వడంతో పాటు కనీస వేతనం రూ.270లు వచ్చేలా కొలతలు ఇచ్చి, అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఓ సాయిరాం, జేఈ నరేంద్రకుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లంతా సక్రమంగా పనిచేసి, గ్రామాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఈపీఆర్‌డీ ఆర్.రాంబాబు ఆధ్వర్యంలో సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశమైన ఏ సచివాలయం పరిధిలోని ఉద్యోగులు, ఆ సచివాలయం పరిధిలోని గ్రామాల్లో ఎటువంటి విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే వెంటనే సంబంధిత వ్యక్తులను హెచ్చరించి, వాటిని తొలగించాలన్నారు. అన్ని పంచాయతీల్లోని చెత్తశుద్ధి నిర్వహణ కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని తెలిపారు.

దీపాల వేలం వాయిదా

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి ఆలయంలో దీపాల విక్రయానికి నిర్వహించిన వేలం వాయిదా పడిందని ఈఓ పి.శ్యామలరావు తెలిపారు. ఆలయంలో రెండేళ్ల పాటు దీపాలు విక్రయంతో పాటు కొబ్బరి ముక్కల సేకరణకు సంబంధించి గురువారం వేలం జరిపామని పేర్కొన్నారు. అయితే పాటదారులు ఎవరూ హాజరుకాకపోవడంతో వాయిదా వేశామని, తదుపరి తేదీ తెలియజేస్తామని అన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



పారాది గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పారాది గ్రామంలో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలకు ఏ కష్టం రాకూడదనే గ్రామానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకువచ్చారన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న కొన్నిరోజులకే పథకాలు అందుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని, అటువంటి ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచి చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ఎవరూ నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అంతకుముందు గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు సంకిలి శాంతకుమారి,వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, సర్పంచ్ ఉత్తరావిల్లి నానేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు అల్లాడ ఉమా, మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్, వ్యవసాయ శాఖ ఏడీ ఎం.శ్యాంసుందరరావు, వెలుగు ఏపీఎం పీఏ స్వామి, ఆర్‌ఐ కల్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది అధికార దాహం

- రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎంపీపీ మంజుల తదితరులు

సంతకవిటి : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికార దాహంతో అలమటిస్తున్నారని, ఏమి మాట్లాడుతున్నారో తెలియని స్థితిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని తమరాం ప్రధాన రహదారిపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇస్తున్న ఇంటి పట్టాలు పథకంపై చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నిరసన తెలిపారు. పేదలకు గతంలో ఇంటి పట్టాలతో పాటు ఇంటిని కూడా మంజూరీ చేయలేక, తమ నేతల అక్రమ భూదందాలకు సహకరించిన చంద్రబాబుకు మళ్లీ ఓటమి తప్పదని తెలిసిపోయిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి ఉద్దేశంతో పేదలకు ఇంటి పట్టాలు ఇస్తుంటే ఆ సెంటున్నర, రెండు సెంట్లు భూమి గోతికి తప్పా దేనికి పనికిరాదని హేళన చేయడం అసహ్యకరంగా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సిరిపురపు మంజుల, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, తమరాం సర్పంచ్ ఆడంగి లక్ష్మి, గౌరునాయుడు, వైస్ సర్పంచ్ కేవీ రమణ, సిరిపురం సర్పంచ్ డోల తిరుపతి, తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు, గోళ్లవలస సర్పంచ్ దాసరి దాలినాయుడు పాల్గొన్నారు.

ప్రజలకు చేరువైన సచివాలయ సేవలు



ఉణుకూరు సచివాలయం వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

రేగిడి : గ్రామాల్లో సచివాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాధరావు సూచించారు. మండలంలోని ఉణుకూరు, కాగితాపల్లి, ఏపీపురం తదితర గ్రామాల్లోని సచివాలయాలను ఆకస్మికంగా గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉణుకూరు సచివాలయం వద్ద ఆయన మాట్లాడుతూ ప్రజలు క్షేత్ర స్థాయిలో సచివాలయాల ద్వారా అందుతున్న సేవలు పొందాలని అన్నారు. మండల కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అవసరం లేదని వెల్లడించారు. అన్ని సచివాలయాల్లో అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు, సంక్షేమ పథకాలు మంజూరీ అవుతున్నాయని వెల్లడించారు. అర్హత ఉంటే చాలు ప్రామాణికంగా సంక్షేమ పథకాలను సచివాలయ ఉద్యోగులు నేరుగా అందిస్తారని, ఎక్కడైనా అలసత్వం ఉంటే తమకు ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. కార్యక్రమంలో ఉణుకూరు సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బొక్కేల రాంబాబు, పంచాయతీ కార్యదర్శి జ్యోతిర్మయి, వీఆర్‌ఓ ఏవీ సత్యనారాయణ, ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి శిరీష

బాడంగి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి, రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని మండల వ్యవసాయాధికారి కె.శిరీష తెలిపారు. గురువారం మండలంలోని రేజేరు గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన ఆమె ఇప్పటికే 76 టన్నుల డీఏపీ, 96 టన్నుల యూరియా తీసుకువచ్చి, మండలంలోని పాల్తేరు, రేజేరు, వాడాడ, వీరసాగరం, బాడంగి, గొల్లాది రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేశామన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. కౌలురైతులు కూడా రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

పంప్‌హౌస్‌లో కొత్త మోటార్ల ఏర్పాటు



మోటార్లు అమర్చే పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పీఎంకే రెడ్డి

తెర్లాం: మండలంలోని చినవంతరాం దగ్గరున్న పంప్‌హౌస్‌లో కొత్తగా రెండు మోటార్లను గురువారం ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని, గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని డీఈఈ పీఎంకే రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులు జరుగుతున్నాయని, జల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయడం జరుగుతోందని, అలాగే క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లను బాగు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పురోగతిపై ఆరా

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రమామణి, ఎంఈఓ తిరుమలరావుతో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు గురువారం సమావేశమై మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనుల పురోగతిపై ఆరాతీశారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. వీటితో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని తెలిపారు. శిథిలావస్థకు చేరిన పాఠశాలలను గుర్తించి, మూడో దశ నాడు–నేడు పనుల ద్వారా పాఠశాలల పునర్నిర్మాణం చేపట్టాలన్నారు.

అందరి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలు లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే జోగులు తదితరులు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి : అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని తమరాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ పథకాలపై మాట్లాడారు. ప్రతీ ఇంటికి ఈ నాలుగేళ్లలో అందించిన సంక్షేమ పథకాల వివరాలును కరపత్రాలు ద్వారా తెలియజేశారు. పలువురి వద్ద సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లుతో మాట్లాడి ఎవరికీ ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం అందిస్తుందని వెల్లడించారు. ప్రతీ సచివాలయం ద్వారా ప్రజలు వద్దకే పరిపాలన వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సిరిపురపు మంజుల, జేసీఎస్ కన్వీనర్ రాగోలు రమేష్‌నాయుడు, తమరాం సర్పంచ్ ఆడంగి లక్ష్మి, గౌరునాయుడు, వైస్ సర్పంచ్ కేవీ రమణ, మాజీ వైస్ ఎంపీపీ గంగ్రేటి కేసరి, సిరిపురం సర్పంచ్ డోల తిరుపతి, తహసీల్దార్ ఎ.సులోచన, ఎంపీడీఓ ఎస్.రఘునాథాచారి, ఏపీఓ త్రినాధరావు, తాలాడ ఎంపీటీసీ కనకల సన్యాసినాయుడు, గోళ్లవలస సర్పంచ్ దాసరి దాలినాయుడు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు సచివాలయ సిబ్బందితో గురువారం సమావేశమై, స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. అనంతరం జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించి, పలు సూచనలు చేశారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటింటికీ వైద్యం



రోగుల ఆరోగ్యం పరిశీలించి, ప్రిస్క్రిప్షన్ రాస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి శిరీష

రామభద్రపురం: ప్రజారోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందించడం జరుగుతోందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎ.ఎల్.జి.శిరీష తెలిపారు. గురువారం మండలంలోని తారాపురం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో పలువురికి వైద్య పరీక్షలు చేసిన ఆమె అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి, మంచానికే పరిమితమైన రోగుల ఆరోగ్యం పరిశీలించి, వైద్యం అందించారు. మెరుగైన ఆరోగ్యానికి పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 104 వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

బొబ్బిలి: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా స్థానిక బ్రహ్మకుమారీస్ రాజయోగ సేవా కేంద్రంలో వారం రోజులుగా వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, గీతాలాపన, నృత్యం, యోగా వంటి విభాగాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర ఇన్‌చార్జ్ బీకే రాజేశ్వరి ఆకాంక్షించారు.



సర్టిఫికెట్లతో విద్యార్థులు

షిర్డీసాయి ఆలయం వద్ద అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

సంతకవిటి : మండలంలోని మందరాడ గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన షిర్డీసాయి ఆలయం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పేదలకు ప్రతీ గురువారం అన్నదానం చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నదాత వావిలపల్లి రామకృష్ణంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పురోహితులు పులఖండం శ్రీనివాసరావుశర్మ, శివాలయ అర్చకులు దేవళ్ల రుద్రమణిభూషణరావు, గోరు సూర్యారావు, గార నర్సింహమూర్తి, వావిలపల్లి నారాయణరావు, వావిలపల్లి మణికంఠ, యడ్ల సూరిబాబు, కొణపల వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ఖోఖో ఆడిస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి

తెర్లాం: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఉపాధ్యాయులు తిరుపతిరావు, బ్రహ్మాజి కోరారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ సబ్జెక్ట్‌ల్లోని కవుల పరిచయం, పద్యాలు–వాటి భావాలను తెలియజేశారు. అనంతరం చిన్నారులతో ఖోఖో ఆడించారు. సాయంత్రం పూట ఆటలు ఆడుకోవాలని, తద్వారా ఆరోగ్యం మెరుగుపడుతుందని వారు తెలిపారు.

చురుగ్గా 'ఉపాధి' పనులు

బాడంగి: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. గురువారం మండలంలోని గజరాయునివలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఏపీఓ లక్ష్మీపతిరాజు ఏప్రిల్ నెలలో కేవలం మూడు వేల మంది వేతనదారులు మాత్రమే పనులకు హాజరయ్యేవారని, ఇప్పుడు 6,520 మంది హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం అందరికీ రూ.240 వేతనం వస్తోందని, నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే రూ.272 వేతనం వచ్చే అవకాశం ఉందన్నారు.



గజరాయునివలసలో జరుగుతున్న ఉపాధి హామీ పనులు

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేత



అప్పలంపేటలో వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఏఎన్‌ఎం

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న వేతనదారులకు తెర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను గురువారం అందజేశారు. నీటిలో ఈ ఓఆర్‌ఎస్ పౌడర్‌ను కలుపుకుని తాగాలని, తద్వారా డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు

వంగర: మండల పరిధి కొప్పరవలస, బంగారువలస గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులు జరిగే ప్రదేశాల్లో వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు గురువారం అందజేశారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పని జరిగే ప్రదేశాలకు వెళ్లి నేరుగా వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేసి వడదెబ్బపై చైతన్యవంతం చేశారు.

రుషింగిలో భూసర్వే ప్రారంభం

వంగర: మండల పరిధి రుషింగి గ్రామంలో భూముల రీసర్వే గురువారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ బూరాడ సుందరరావు గురువారం పరిశీలించారు. సర్వేయర్లంతా సమష్టిగా భూముల రీసర్వే వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్వేయర్లు పాల్గొన్నారు.



రీసర్వే పరిశీలిస్తున్న డీటీ సుందరరావు

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

రాజాం : స్థానిక జీఎంఆర్ఐటీలో గురువారం ఏపీఈఏపీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 221 మంది విద్యార్థులకుగానూ 211 మంది హాజరుకాగా, పది మంది గైర్హాజరైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. మధ్యాహ్నం 220 మందికి 217 మంది హాజరయ్యారని, ముగ్గురు విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని వెల్లడించారు.

ఎంఈఓ పరిశీలన




నందబలగ పాఠశాలలో వైరింగ్ పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాధరావు

తెర్లాం: మండలంలోని నందబలగ, తెర్లాం, కుసుమూరు పాఠశాలల్లో జరుగుతున్న మనబడి నాడు–నేడు పనులను ఎంఈఓ త్రినాధరావు గురువారం పరిశీలించారు. వేసవి సెలవులు ముగిసేలోగా పనులు పూర్తి చేయించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ఏర్పాటుకు అవసరమైన పనులను దగ్గరుండి చేయించాలని తెలిపారు. అలాగే బడిఈడు పిల్లలంతా బడిలో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రేగిడి : ప్రజలకు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. రేగిడి, ఆమదాలవలస గ్రామాల్లోని ప్రజలకు సైబర్ నేరాలపై గురువారం అవగాహన కల్పించారు. మనకు తెలియకుండానే ఫోన్ ద్వారా సమాచారం రాబట్టి సైబర్ నేరగాళ్లు మన బ్యాంకు ఖాతాల్లోని నగదును దొంగిలిస్తారని వెల్లడించారు. ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగదారులు ఫోన్‌పే, పేటీఎం, గూగుల్ పే వినియోగం సమయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. బ్యాంకు వద్ద, ఏటీఎంలు వద్ద నగదు డ్రా చేసిన ప్రజలు ఇంటికి వెళ్లే వరకూ జాగ్రత్తగా ఉండాలని, మన చుట్టు పక్కల అపరిచితులు, కొత్త వ్యక్తులు కనిపిస్తే అప్రమత్తత అవసరమని పేర్కొన్నారు.



రేగిడిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ప్రయాణికుల కోసం మజ్జిగ చలివేంద్రం

రాజాం : పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద మెంతిపేట అమ్మవారి కాలనీ సుందరం మందిరం సత్యసాయి భక్తులు గురువారం మజ్జిగ చలివేంద్రాన్ని నిర్వహించారు. వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు వెల్లడించారు. ఎండ తీవ్రత తగ్గే వరకూ పట్టణంలో చలివేంద్రాన్ని కొనసాగిస్తామని సత్యసాయి భక్తులు తెలిపారు. ప్రయాణికులు ఎండ సమయంలో ఈ చలివేంద్రం వద్దకు వచ్చి దాహార్తిని తీర్చుకోవాలని కోరారు.